# అసలు సంగతి

— పైడికొండల వెంకటేశ్వరరావు.

కావేరి చెప్పిన కథ:

నా పేరు కావేరి. నా భర్త పేరు రాజారావు. నేనిప్పుడు చెప్పబోయేది ఆయన కథే. మా పెళ్ళయ్యి ఏడాది దాటింది. ఇరవై రోజుల క్రితమే పెళ్ళిరోజుని జరుపుకున్నాం. ఈ ఏడాది నుంచీ మావారి ఉద్యోగ రీత్యా రెండు వూళ్ళు మారాం. ఇది మూడో వూరు. ఈ వూరొచ్చి ఆరు నెలలవుతోంది. "ఎప్పుడూ బయట వూళ్ళలోనే వుంటున్నారు. కనీసం మొదటి పెళ్ళి రోజయినా మన ఇంట్లో జరుపుకోండి" అని మా అత్తమామలు ఆయన్ని అడగడంతో మా పెళ్ళిరోజు మా అత్తవారింట్లో వైభవంగా జరిగిపోయింది. అక్కడ వరకూ బాగానే వుంది. ఆ తర్వాతనే ప్రారంభమైంది అసలు కథ.

ఈ ఇరవై రోజుల్నుంచీ చూస్తున్నాను. ఎప్పుడూ పరాయి ఆడవాళ్ళ వైపు కన్నెత్తి కూడా చూడని మా ఆయన, ఇప్పుడు ఈ ఇంటి వాళ్ళమ్మాయి కీర్తనతో చాలా చనువుగా మసలుతున్నారు. ఆమెతో గంటల తరబడి కబుర్లు చెబుతున్నారు. చాలా సార్లు నా దగ్గర కూడా ఆమె ప్రస్తావన తెచ్చారు.

నిజం చెపపాలంటే ఆయన సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే. కానీ ఇప్పుడు శ్రీకృష్ణుడిలా మారిపోయారేమో అనేది నా బాధ, భయం.

ముందే చెప్పాముగా! పెళ్ళయిన దగ్గర్నుంచీ ఆయన పరాయి ఆడపిల్లల వైపు కన్నెత్తి చూడ్డం కూడా నేను చూడలేదని. ఎప్పుడూ ఎవరి గురించీ సరదాక్కూడా కామెంట్స్ చేయలేదాయన.

ఒకవేళ...ఇంగ్లీషోడు చెప్పిన 'సెవెనియర్స్ ఇచ్' లాంటిది ఈయనకి ఒక సంవత్సరానికే వచ్చేసిందా? నా మీద మోజు తీరిపోయిందా? సంసార జీవితం బోర్ కొడుతోందా? ఉహు! అలా అనుకోవడానికి కూడా వీల్లేదు. ఎందుకంటారా...

ఏ విషయంలోనైనా భార్య, భర్తతో సమానమే అని అంటారాయన. చివరికి 'ఆ' విషయంలో కూడా. బెడ్‌మీద నాకు చాలా స్వేచ్ఛనిస్తారాయన. నేను కూడా ఆయనకి తగ్గట్టే 'యాక్టివ్ పార్ట్' తీసుకుంటాను. ఆ విషయంలో మాకు అసంతృప్తి అనేదే లేదు.

పెళ్ళయిన కొత్తల్లో ఎంతలా ఎంజాయ్ చేశామో, ఇప్పుడు కూడా అంతలానే ఎంజాయ్ చేస్తున్నాము.

అలాంటప్పుడు ఆయనకి వేరే అమ్మాయితో అవసరం ఎందుకొస్తుంది? అదే అర్థం కావడం లేదు నాకు.

కీర్తనకి నా చెల్లెలి వయసుంటుంది. ఆకర్షణీయమైన ముఖంతో, రెచ్చగొట్టే ఒంపు సొంపులతో గజ్జెల గుర్రంలా వుంటుందామె. ఈ వీధి లోంచి వెళ్ళే ప్రతి మగాడి చూపూ కీర్తన మీద పడుతుంది. నా మీద కూడా పడుతుందనుకోండి. అది వేరే సంగతి.

అలాంటి అమ్మాయి కళ్ళ ముందు కదుల్తోంటే ఏ మగాడు మాత్రం మామూలుగా వూరుకుంటాడు? అందుకే నాకు భయంగా వుంది. ఆయన మీద చాలా నమ్మకం కూడా వుంది.

వాళ్ళ మధ్య ఏమీ లేదని అనుకోలేక పోతున్నాను. అలాగని ఆయన్ని అనుమానించ లేక పోతున్నాను.

ఈ ఆలోచనలతో నాకు పిచ్చెక్కి పోతుందనుకోండి.

* * *

కీర్తన చెప్పిన కథ:

నా పేరు కీర్తన. నేనెలా వుంటానంటే....

నాకు పేరు లేకుండా వచ్చిన ఓ ప్రేమ లేఖలోని వర్ణనని చెబుతాను. అర్థం చేసుకోండి.

"ప్రియా నీ ముఖం నేల దిగివచ్చిన చంద్రబింబం.

నీ మెడ ఓ శంఖం.

నీ ఎద పాలసంద్రం.

నీ నడుము అసలుందా?

నీ జఘనం విశాలమైన థార్ ఎడారి.

నీ... అంటూ చాలా సుత్తి వ్రాశాడనుకోండి. అదంతా ఇప్పుడనవసరం.

అంత అందంగా వుండే నాతో ప్రతి మగాడూ స్నేహం చేయాలనుకోవడంలో ఆశ్చర్యమేముంది? అందులో ఆశ్చర్యం ఏమీ లేదు కానీ, మా ఇంట్లో అద్దెకున్న రాజారావు ఈ మధ్య నాతో చనువుగా వుండటం మాత్రం నిజంగా ఆశ్చర్యమే.

వాళ్ళు మా ఇంట్లోకొచ్చి ఆరు నెలలవుతోంది. ఎప్పుడూ చాలా తక్కువగా మాట్లాడే రాజారావు గారు ఈ మధ్య నాతో చాలా ఎక్కువగా మాట్లాడ్డం నాకు చాలా చాలా ఆశ్చర్యంగా అనిపిస్తోంది.

కావేరి, రాజారావు జంటని చూస్తే చాలా ముచ్చటగా వుండేది నాకు. ఒకరి కోసం మరొకరు పుట్టినట్టు వుంటారు వాళ్ళిద్దరూ.

'మంచి భర్తంటే ఇలా వుండాలి' అని నేననుకునే రాజారావు గారు ఈ మధ్య నా దగ్గరే కూర్చుని ప్రతి విషయం మీదా నా అభిప్రాయాలూ, అభిరుచులూ అడుగుతూ వేధించుకు తింటున్నాడు. 'మన సంస్కృతి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?' అంటాడు. 'పెళ్ళి గురించి నీ ఊహ ఏమిటి?' అని అడుగుతాడు. 'ఎలాంటి భర్త కావాలని కోరుకుంటున్నావు?' రేపు పెళ్ళయ్యాక భర్త నిన్ను ఆవేశంతో కొడితే ఏం చేస్తావు? అలసిపోయి ఇంటికొచ్చిన భర్తని ఎలా ట్రీట్ చేస్తావు? భర్తలో నీకు నచ్చని అంశాల గురించి ఎలా ఫీలవుతావూ?' అంటూ ప్రాణాలు తోడేస్తున్నాడు.

విసుగెత్తి పోతోందనుకోండి. అయినా భరించాను.



కానీ, ఇవాళ సాయంత్రం ఇంట్లో నేనొక్కదాన్నే వుండగా వచ్చాడు. మాట్లాడుతూ, మాట్లాడుతూ నా చేయి పట్టుకుని తన మీదికి లాక్కున్నాడు.

ముందు షాక్ తిన్నాను. తేరుకున్న వెంటనే అతని మీంచి లేచి చాచి దవడ మీద కొట్టాను. ఛీ ఛీ! వాడికి దెబ్బ తగిలిందో లేదో కాని నా చేయి భుజం దగ్గర కలుక్కుమంది. అరచేయి మండింది. గుండె ఇంకా మండుతూనే వుంది.

### రాజారావు చెప్పిన కథ:

నా పేరు రాజారావు. నా భార్య పేరు కావేరి. కావేరి నిజంగా కావేరినే.

ఆమెతో నాకు ఏ విధమైన బాధా లేదు. ముఖ్యంగా 'ఆ' విషయంలో ఆమెతో నాకు స్వర్గమే.

మంచమ్మీద ఉరకలు వేసే సెలయేటిలా వుంటుందామె.

అలాంటి కావేరి ఈ మధ్య ఎందుకో ముభావంగా వుంటోంది.

ఆమె ఏ విషయంలో ఎలా వున్నా నాకు డోంట్ వర్రీ.

కానీ, బెడ్ మీద ఆమె చురుకుదనం, ఉత్సాహం, వేగం మిస్ కావడం మాత్రం నాకు చాలా బాధగా వుంది. చాలా అసంతృప్తిగా వుంది. తొలగించుకోకపోతే జీవితం నిస్సారమైపోతుందని నాకు తెలుసు. అందుకే ఆమె అలా ప్రవర్తించడానికి కారణమేమిటాని తెగ ఆలోచించాను. ఇందాకే తట్టింది.

కావేరి ఇదివరకట్లా నా పట్ల శ్రద్ధ చూపకపోవడం, బెడ్ మీద ముభావంగా వుండిపోవడం, కీర్తన పేరెత్తితేనే ముఖం ముడుచుకు పోవడం, నేను కీర్తన ఇంట్లోకి వెళ్ళబోతుంటే ఏదో పని చెప్పి ఆపాలని చూడటం, ఇవన్నీ కలిపి ఆలోచిస్తే నాకు అర్థమైపోయింది.

నిజంగా నాకు చాలా సంతోషంగా అనిపించింది.

ఎందుకంటే కావేరి నేను తనకి మాత్రమే సొంతం కావాలనుకుంటోంది.

నిజమే! ఆమెకి అనుమానం రావడంలో తప్పేమీ లేదు. అనుమానమొచ్చేలా ప్రవర్తించడం నాదే తప్పు.

పెళ్ళంటే నూరేళ్ళ పంట సరైన భాగస్వామిని ఎన్నుకుంటే. లేకపోతే అదే నూరేళ్ళ మంటయి పోతుంది. ఆ విషయం నాకు బాగా తెలుసు. అందుకే, నాకు సరిపడ్డ అమ్మాయి అనిపించాకనే కావేరిని పెళ్ళి చేసుకున్నాను. నా అంచనా తప్పు కాలేదు.

కావేరితో నా జీవితం స్వర్గమైంది.

చాలా సంతోషంగా, ఆనందంగా సంవత్సరం గడిచిపోయింది. మా పెళ్ళయ్యి అప్పుడే ఏడాది అయ్యిందంటే నాకు నిజంగా నమ్మబుద్ధి కాదు. అంత బాగా గడిచిపోయింది కాలం ఆమె సాహచర్యంలో.

మా మొదటి పెళ్ళి రోజుని అమ్మా నాన్నల కోరిక మీద మా సొంత ఊళ్ళో జరుపుకున్నాం.

అప్పుడు "ఒరే! రాజా! మన రాఘవక్కూడా మంచి సంబంధం ఏదైనా వుంటే చూడరా" అన్నాడు మా నాన్న గారు.

రాఘవ మా తమ్ముడు.

నాకు వెంటనే కీర్తన గుర్తొచ్చింది. కానీ, ముందే చెప్పాముగా. జీవిత భాగస్వామిని ఎన్నుకోవడంలో తప్పటడుగు వేస్తే జీవితం ఏమైపోతుందో!

అందుకే, అక్కణ్ణుంచి వచ్చిన దగ్గర నుంచీ కీర్తనని పరీక్ష చేస్తున్నాను.

మా రాఘవ ఆశలూ, కలలూ, అభిరుచులూ అన్నీ నాకు తెలుసు. అందుకే వాడికి తగ్గ అమ్మాయా కాదా? అని చిన్న టెస్ట్ చేశాను.

మొత్తం మీద కీర్తన మా వాడికి తగ్గ అమ్మాయని నిర్ణయానికొచ్చాను.

చెంప పగిల్తే పగిలింది కానీ ఇవాళ ఆమె అంటే ఏమిటో పూర్తిగా తెలిసింది.

వెంటనే ఆమె గురించి నాన్నకి వ్రాయాలి. దానికంటే ముందు నా గురించి కావేరి మనసులోనూ, కీర్తన మనసులోనూ ఏర్పడిన చెడు అభిప్రాయాన్ని తొలగించాలి.

వెంటనే ఆ పనిచేయకపోతే ఏం జరుగుతుందో మీకు తెలుసు కదండీ! అందుకే ఆ ప్రయత్నంలో పడతాను. వెళ్ళొస్తానండీ.